ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: (కిలో.. రూపాయల్లో..) టమాటా.39, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 28, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు రేషన్‌కార్డులు పంపిణీ

చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లకు చెందిన నూతన లబ్ధిదారులకు నేడు రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సీతాఫల్‌మండి జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో ఈనెల 2వతేది శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇంఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ పలువురు కార్పొరేటర్లు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ ఆదం సంతోష్‌కుమార్‌లు హాజరుకానున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మర్రి పురురవరెడ్డి..

సనత్‌నగర్: నియోజకవర్గంలోని సమస్యలపై బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి శుక్రవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ పనులతో పాటు రోడ్ల నిర్మాణం, ప్యాచ్‌వర్క్ పనులు, పారిశుధ్యం తదితర సమస్యలను ఆయన ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు తీసకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నెమలి ఆనంద్, విజయ్‌కుమార్, దయానంద్ పాల్గొన్నారు.

నేడు ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకుల సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సదస్సు జరగనుంది. యూనివర్సిటీ అభివృద్ధిలో కాంట్రాక్టు అధ్యాపకుల పాత్ర అనే అంశం పై ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు జరిగే సదస్సుకు ప్రొ.హరగోపాల్, ప్రొ.పీఎల్ విశ్వేశ్వర్ రావు, బీసీ జాతీయ నాయకులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీలు పాల్గొని ప్రసంగించనున్నట్లు సంఘం అధ్యక్షులు డా.పరుశురామ్ తెలిపారు. రాష్ట్రంలోని 12 వర్సిటీలకు చెందిన కాంట్రాక్టు అధ్యాపకులు హాజరుకావాలని ఆయన కోరారు.

అన్నా భావుసాఠె సాహిత్యాన్ని వెలుగులోకి తేవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రముఖ రచయిత డా.అన్నాభావు సాఠె సాహిత్యాన్ని ఓయూ విద్యార్థులు వెలుగులోకి తేవాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డా.జంపాల రాజేష్ అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో సాహిత్య సామ్రాట్ డా.అన్నా భావు సాఠె 105వ జయంతిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు కాంబ్లే శంకర్ మాంగ్ అధ్యక్షత వహించగా డా.జంపాల రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నా భావు సాఠె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డా.జంపాల రాజేష్ పేర్కొన్నారు.

ఓయూలో మాల విద్యార్థుల బ్లాక్ డే



మాట్లాడుతున్న మాదాసు రాహుల్ రావు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఓయూలో మాల విద్యార్థులు బ్లాక్ డే పాటించారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన కార్యక్రమంలో మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరిస్తూ సుప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పుకు సరిగ్గా ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఆగస్టు 1న బ్లాక్ డేగా పాటిస్తున్నట్లు తెలిపారు. అశాస్త్రీయంగా విభజించిన ఎస్సీ మూడు గ్రూపులలో 3వ గ్రూప్ రోస్టర్ పాయింట్‌తో మాలలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దాసరి రవి, కరణ్, ప్రవీణ్, ప్రదీప్, లింగమూర్తి, శ్రీకాంత్, రాకేష్, నరేష్, శివ, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్.. టెన్షన్
ఇక వద్దు

తార్నాక జంక్షన్ ఒక గుణపాఠం

తార్నాక జంక్షన్ జీహెచ్‌ఎంసీ అధికారులకు పెద్ద గుణపాఠాన్ని నేర్పింది. ఈ తరహా తప్పిదాలు ముమ్ముందు జరుగకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించుకున్నారు. రెండేళ్లుగా నగరంలో జంక్షన్లు, ప్రధాన రహదారుల ఆధునీకరణ వంటి చర్యలు వేగవంతంగా చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యల నివారణ కోసం జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం (సికింద్రాబాద్) జోనల్ కార్యాలయ అధికారులు చేపట్టిన 'కన్సల్టెన్సీ కమిటీల అధ్యయనాల ద్వారా ఆశించిన ఫలితాలను రాబడుతున్నాయి. ట్రాఫిక్ పోలీస్, విద్యుత్ విభాగాల అధికారులను సమన్వయం చేస్తూ సుందరీకరణ, విస్తరణ పనులు చేపడుతున్నారు. ఇంతరవకు పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ తార్నాక కూడలి విషయంలో తీసుకున్న నిర్ణయం మాత్రం బెడిసికొట్టింది.

- వాహనాల పునరుద్ధరణతో సమస్యలు
- వ్యూహం బెడిసి కొట్టడంతో మళ్లీ జంక్షన్ మూసివేత
- విస్తరణ పేరిట రూ.40 లక్షలు వృథా
- ముమ్ముందు ఇలా వద్దని జీహెచ్‌ఎంసీ నిర్ణయం

సికింద్రాబాద్: ట్రాఫిక్ సమస్యలను అధిగమించడం కోసం తార్నాక జంక్షన్‌ను ఎనమిదేళ్ల క్రితం మూసివేశారు. ఇక్కడ నిర్మించిన మెట్రో పిల్లర్ల కాణంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని భావించిన అప్పటి జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు జంక్షన్‌ను మూసివేశారు. ప్రత్యామ్నాయంగా ఉప్పల్ వైపు ఐఐసీటీ, మెట్టుగూడ వైపు రైల్వే డిగ్రీ కళాశాల సమీపంలో 'యూ' టర్న్‌లను ఏర్పాటు చేశారు. దీంతో తార్నాక కూడలిలో ట్రాఫిక్ సమస్యలకు ఒకింత పరిష్కారం లభించినట్లు అయింది.

దూరాభారం పేరుతో..

'యూ' టర్న్‌లతో దూరాభారం పెరిగిందని, రెండు కిలోమీటర్ల మేర ప్రయాణించి వాహనాలు తిప్పుకొని రావడం వాహనదారులకు సమస్యగా మారిందని కొందరు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. అదీ కాకుండా తార్నాక కూడలి మీదుగా ఉన్న (ఆర్‌టీబీ) వంతెన ఎక్కిదిగే ప్రాంతాల్లో నెలకొని ఉన్న 'యూ' టర్న్‌లు ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయన్న అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఉదయం, సాయంత్రం కార్యాలయాల సమయంలో రెండు యూ టర్న్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యలు మరింత జటిలం అవుతున్నాయన్న అంశాలను అధికారుల దృష్టికి తెచ్చారు.

రూ.40 లక్షలు వృథా..

కొందరు నాయకులు, మరికొందరు స్థానికుల అభిప్రాయం మేరకు జీహెచ్‌ఎంసీ, సిటీ ట్రాఫిక్ పోలీసులు తార్నాక జంక్షన్ వద్ద పరిస్థితిని అధ్యయనం చేశారు. యూ టర్న్‌లను తొలగించి, ఎనిమిదేళ్ల క్రితం మూసివేసిన తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నారు. తార్నాక జంక్షన్ పునరుద్ధరణ కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. జంక్షన్ మీదుగా వాహనాల రాకపోకలు కోసం కూడలి ఆధునీకరణ, విస్తరణ కోసం పునరుద్ధరించడం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం రూ.40 లక్షల నిధులు కేటాయించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. నాలుగు భవనాలను పాక్షికంగా తొగించారు.



జంక్షన్ మూసివేతతో మళ్లీ ప్రశాంత పరిస్థితి

మళ్లీ మూసివేయాలని డిమాండ్..

ఇటు ట్రాఫిక్ పోలీసులు, అటు వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు నరకం చూపించాయి. గత్యంతరం లేని పరిస్థితిలో మళ్లీ జంక్షన్‌ను మూసివేయాలన్న డిమాండ్ తెరమీదకు వచ్చింది. ట్రాఫిక్ పోలీసులు ఆన్‌లైన్ ద్వారా ప్రజల అభిప్రాయాన్ని కోరారు. మెజారిటీ ప్రజలు మూసివేయాలన్నారు. ట్రాఫిక్ పోలీసుల సిఫారసు మేరకు తిరిగి జంక్షన్ మూసివేయడంతో తిరిగి ట్రాఫిక్ సమస్యల నుంచి వాహనదారులకు పశమనం కలిగింది. జంక్షన్ మూసివేసిన 40 రోజుల నుంచి తార్నాక కూడలిలో ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయి.

బస్ స్టాప్‌లు మార్చండి...

తార్నాక జంక్షన్ నుంచి వాహనాలను పునరుద్ధరించిన నేపథ్యంలో కూడలికి దగ్గరగా ఉన్న బస్‌షెల్టర్లను తొలగించారు. కూడలికి దూరంగా కొత్త షెల్టర్లు ఏర్పాటు చేశారు. దీంతో బస్సు ప్రయాణికులు తీవ్రంగా అసౌకర్యానికి గురవుతున్నారు. తిరిగి జంక్షన్‌ను మూసివేసినప్పటికీ బస్‌షెల్టర్లను మాత్రం తిరిగి యథాస్థానంకు బదలాయించలేదు. అధికారులు స్పందించి కూడలికి సమీపంలో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జంక్షన్ పునరుద్ధరణతో ట్రాఫిక్ గందరగోళం

పాత సమస్యలు పునరావృతం..

అటూ ఇటూ నామమాత్రపు అభివృద్ధి పనులు చేపట్టి మొత్తానికి జంక్షన్ మీదుగా వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. పునరుద్ధరించిన రోజు నుంచి ట్రాఫిక్ పోలీసులకు ట్రాఫిక్ సమస్యలు చుక్కలు చూపించాయి. రోజు పదిమంది పోలీసులు ఇక్కడ పహారా కాసినా కిలో మీటర్ల మేర వాహనాలు బారులు తీరడం, సమస్యను పరిష్కరించడం పోలీసులకు తలకు మించిన భారంగా పరిణమించింది. తొలుత ఏ మెట్రో పిల్లర్లు సమస్యాత్మకంగా ఉన్నాయని భావించారో అవే పిల్లర్లు మళ్లీ అవే సమస్యలు సృష్టించాయి. దీంతో జంక్షన్‌లో 'రైట్' టర్న్‌లు మూసివేశారు. దీంతో వాహనదారులకు మరిన్ని సమస్యలు ఉత్పన్నం అయ్యాయి.

బీసీలను ప్రాధాన్య పోస్టుల్లో నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో సామర్థ్యం గల బీసీ అధికారులను ప్రాధాన్యత గల పదవుల్లో నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీ అధికారులకు మంత్రులు, ఎమ్మెల్యేల పైరవీలు లేనందున ప్రాధాన్యతలేని పోస్టులలో నియమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అన్యాయం ఇప్పుడు జరుగుతోందని బీసీల పై వివక్షత చూపకుండ సామర్థతనుబట్టి పదవులను కట్టబెట్టాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

వర్సిటీల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



కేంద్రమంత్రితో ఓయూ ఉద్యోగ నేత ఖదీర్‌ఖాన్

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలోని విశ్వవిద్యాలయాల ఉద్యోగుల దీర్ఘ కాలిక సమస్యలను పరిష్కరించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతి పత్రం సమర్పించినట్లు ఓయూ ఎన్‌జీవోస్ సంఘం నేత ఖదీర్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం అఖిల భారత విశ్వవిద్యాలయాల ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో మంత్రిని కలసి అనేక అంశాల పై చర్చించి వినతి పత్రాన్ని అందచేసినట్లు తెలిపారు. వర్సిటీల ఉద్యోగులకు పాత పింఛన్ (ఓపీఎస్) అమలు, పాలక మండలిలో నాన్‌టీచింగ్ ఉద్యోగుల ప్రాతినిధ్యం, క్వార్టర్ల నిర్మాణానికి యూజీసీ నిధులు కేటాయించాలని తదితర అంశాలను వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంలా కాదు..

మంత్రి పొన్నం ప్రభాకర్



లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: గత ప్రభుత్వంలో ఉప ఎన్నికలు, ఎన్నికల సమయంలోనే ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత ఉండేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి, అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కంటోన్మెంట్ మ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనతో కలసి శుక్రవారం లీ ప్యాలెస్‌లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ జేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం రేషన్‌కార్డులను అందజేస్తూ కార్డుపై సన్నబియ్యం పంపిణీ జేస్తూ చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. కంటోన్మెంట్‌లో 1150 మందికి నూతనంగా రేషన్‌కార్డులు జారీ చేస్తున్నామని తెలి పారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ముకుందరెడ్డి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శ్రీధర్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు.

బోర్డు కార్యాలయాన్ని సందర్శించిన రక్షణశాఖ డీజీ

రసూల్‌పురా: రక్షణ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ శైలేంద్రనాథ్ గుప్త శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయాన్ని సందర్శించారు. బోర్డు సీఈవో మధుకర్ నాయక్, డిఫెన్స్ ఎస్టేట్స్ అధికారి (డీఈవో) దినేష్‌కుమార్ రెడ్డి, జాయింట్ సీఈవో పల్లవి విజయవంశీ, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద డీజీని కలిశారు. ఈ సందర్భంగా బోర్డు కార్యాలయంలోని వివిధ విభాగాల పని తీరును డీజీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు అంశాలను ప్రస్తావిస్తూ వాటిని పరిష్కరించాలని నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద కోరారు.

◆ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 16 బజారు ప్రాంతాల్లో సుమారు పదివేల ఇళ్లల్లో వందేళ్ళుగా నివాసం ఉంటున్న వారి ఇళ్ళను ఫ్రీ హోల్డ్ హక్కుగా మార్చాలని కోరారు. బీ4 ఖాళీ రక్షణ శాఖ స్థలాల్లో 40 ఏళ్ళుగా గుడిసెలు, రేకులషెడ్లు వేసుకుని నివాసం ఉంటున్న భూములను స్థలబదలాయింపు క్రింద రాష్ట్ర ప్రభుత్వా నికి బదలాయించి నివాసితులకు పట్టాలు ఇచ్చే దిశగా చొరవ చూపాలని కోరారు. ఈ అంశాలను రక్షణమంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని నర్మద కోరారు.



రక్షణ మంత్రిత్వ శాఖ డీజీకి వినతిపత్రం అందజేస్తున్న భానుక నర్మద

బీజేపీ ఓబీసీ మోర్చా ధర్నాను విజయవంతం చేద్దాం



సమావేశంలో ముదిరాజ్ సంఘం నేతలు..

సనత్‌నగర్: బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 2న ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద జరిగిన బీజేపీ ఓబీసీ మోర్చా ధర్నాకు భారీగా తరలిరావాలని ముదిరాజ్ సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. సనత్‌నగర్ డివిజన్ ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి సుధాకర్‌ముదిరాజ్, సిర్మనీ నరేష్‌ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం సనత్‌నగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పార్టీలకతీతంగా ధర్నాకు తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు విఠల్‌మురళి, అడ్వైజర్ నాగరాజు, ఉపాధ్యక్షులు శివశంకర్, ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



నిఖిల్ (ఫైల్)

చిలకలగూడ: బాలుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన నిఖిల్ (11) బ్రాహ్మణబస్తీలోని ఉజ్జయినీ స్కూలులో యుకేజీ చదువుతున్నాడు. సోదరి రేణుకతో కలిసి ప్రతిరోజు ఉదయం 9 గంటలకు స్కూలుకు వెళ్లి సాయంత్రం 5 గంటలకు ఇంటి చేరుకునేవాడు. గత నెల 30కు వెళ్లిన నిఖిల్ తిరిగి ఇంటికి చేరలేదు. స్కూలు బయట పుస్తకాలు, వాటర్‌బాటిల్ ఉన్నాయి. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తల్లి లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కులం పేరుతో దూషించి దాడి

రాంగోపాల్‌పేట్: ఓ యువకుడిని కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల తెలిపిన మేరకు.. టకారాబస్తీకి చెందిన సాయి కిరణ్ గురువారం మోండా మార్కెట్ నుంచి ఇంటికి వెళుతున్నాడు. పాట్‌మార్కెట్‌లో జువెలర్స్ పేరుతో షాపును నిర్వహించే గేవల్ అల్లుడు అభిషేక్ తన కారును రోడ్డు మీద నిలిపి ఉంచాడు. సాయి కిరణ్ కారును తీయాలని హారన్ కొట్టాడు. దీంతో ఇద్దరి మధ్య చిన్న వాగ్వివాదం జరుగగా షాపులో ఉన్న గేవల్‌తో పాటు సిబ్బంది అందరూ కలిసి సాయి కిరణ్‌పై దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించాడు. దీనిపై సాయి కిరణ్ మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మహంకాళి ఏసీపీ సైదయ్య కేసును దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



రసూల్‌పురా: కంటోన్మెంట్ అన్నానగర్‌లోని బీరప్ప దేవాలయంలో కురుమసంఘం ఆధ్వర్యంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో బోనాలను బీరప్పకు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రావణమాసం ఆధ్యాత్మిక శోభ



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని పలు దేవాలయాలు శ్రావణమాసం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. శ్రావణమాసం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, బోలక్‌పూర్, మోండా మార్కెట్, బండిమేట్, రాణిగంజ్, ఓల్డ్‌బోయిగూడ, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లోని దేవాలయాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పూజలు నిర్వహిస్తున్నారు. జీరా హైదర్‌బస్తీలోని సుప్రసిద్ధమైన శ్రీ సంతోషిమాత దేవాలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు దేవాలయంలో పూజలు నిర్వహించారు. సంతోషిమాత దేవాలయంలో ఈ నెల 22వరకు శ్రావణమాసం వేడుకలను అత్యంతవైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గణేష్, ప్రేమ్, అరుణ్ గౌడ్ తదితరులు చెప్పారు.

చలో ప్రజా భవన్‌కు తరలిరండి

అడ్డగుట్ట: ఉద్యమకారుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 5న నిర్వహించతలపెట్టిన చలో ప్రజా భవన్‌ను జయప్రదం చేయాలని ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ యాదగిరి పిలుపునిచ్చారు. శుక్రవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలిదశ, మలిదశ ఉద్యమంలో అమరులైన ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. అదే విధంగా ఉద్యమకారులకు కూడా ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలు అందించాలన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి అన్నారు. బేగంపేట గురుమూర్తిలేన్‌లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ రామేశ్వర్‌రావులతో పాటు నాయకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలి



మాట్లాడుతున్న కోట శ్రీనివాస్ గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: గత అసెంబ్లీ ఎన్నికలలో తప్పుడు సమాచారంతో పోటీ చేసి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని ఓయూ విద్యార్థి నాయకుడు, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు కోట శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ఎమ్మెల్యేల అనేక అక్రమాలు వెలుగు చూసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాజీ మంత్రి మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి 2023 ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్‌ను దాఖలు చేశారని ఆరోపించారు. పూర్తి ఆధారాలతో సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు కోట శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సతీష్, గణేష్, మిద్దె రాము, వెంకట్ ముదిరాజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

'కొత్త' సంతోషం కొందరికే..

- నేడు సికింద్రాబాద్‌లో కార్డుల పంపిణీ
- 1803 మంది లబ్ధిదారుల ఎంపిక
- వేలమంది దరఖాస్తుదారుల్లో నిరాశ

సికింద్రాబాద్: పదేళ్ల నిరీక్షణ అనంతరం సికింద్రాబాద్ నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డుల జారీ కోసం రేషనింగ్ అధికారులు తొలి జాబితాను సిద్ధం చేశారు. వేల సంఖ్యలోని దరఖాస్తుల్లోంచి పలు వడపోతల అనంతరం వందల సంఖ్యలో లబ్ధిదారులను అర్హులుగా ఎంపిక చేశారు. తొలి విడత కేవలం 1803 మందికి మాత్రమే కార్డులు అందించేందుకు పౌరసరఫరాల విభాగం అధికారులు తుది జాబితాను సిద్ధం చేశారు. ఈనెల 2న సీతాఫలమండి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలు లో లబ్ధిదారులకు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ ప్రారంభించ నున్నారు. దీంతో వేలాది మంది దరఖాస్తు దారుల్లో నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

◆ సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి రేషన్ కార్డుల కోసం ఇప్పటిరకు 11 వేల పైచిలుకు దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నట్టు సికింద్రాబాద్ సహాయ పౌర సరఫరాల అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 4,100 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. తాజా ప్రభుత్వ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల నుంచి 6,900 వేల దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రజాపాలనలో అందిన 6,900 వేల దరఖాస్తులను పరిశీలించిన అధికారులు ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఇందులోంచి 4450 మంది దరఖాస్తు దారుల ఇంటింటి సర్వే ద్వారా వాస్తవ పరిస్థితులను సేకరించి 1803 మందికి కార్డులు జారీ చేసేందుకు ఎంపిక చేశారు. ఐదు డివిజన్లలో కొత్త కార్డుల జారీ కోసం పారదర్శకంగా సర్వే నిర్వహించి అర్హుల జాబితా ఎంపిక చేశామని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ, రేషనింగ్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. పదేళ్ల నిరీక్షణ అనంతరం కేవలం 1803 మందికి మాత్రమే కార్డులు ఇచ్చేందుకు అధికారులు జాబితా సిద్ధం చేయడంతో లష్కర్ ప్రజల్లో నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా ఇది మొదటి జాబితా మాత్రమేనని, దశల వారీగా అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని రేషనింగ్ అధికారులు చెపుతున్నారు.

డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు

వెంగళరావునగర్: నిరంతరం డ్రైనేజీతో ప్రజలు అనేక నరకయాతన అనుభవిస్తున్నారని, త్వరలోనే శాశ్వత పరిష్కారం చేయనున్నామని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ మసీదుగడ్డ ప్రాంతాల్లో డ్రైనేజీ రోడ్లమీదకు వచ్చి పొంగి పొర్లుతుండటంతో పలువురు ఈ విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్పొరేటర్ జలమండలి మేనేజర్ సూర్యకు సమాచారం అందించారు. ఆయనతో కలిసి జవహర్‌నగర్ మసీదుగడ్డ ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... జవహర్‌నగర్ లాంటి బస్తీల్లో నిరంతరం సమస్యలు వస్తున్నాయన్నారు. ఇకపై ఎలాంటి సీటి, మురుగునీటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత జలమండలి శాఖపై ఉందన్నారు.